

# ఆకులు రాల్చిన కాలం

పాలగిరి విశ్వప్రసాద్

'చివరకు నా బ్రతుకుపై నేను నిర్ణయం తీసుకొనే స్వేచ్ఛ కూడా కోల్పోయానా?' కల్పనలో ఈ ప్రశ్న, గత మూన్నెళ్లుగా సుళ్లు తిరుగుతూనే ఉంది. మంచం మీద వెల్లకిలా పడుకున్న కల్పన కళ్లలో నీటి చెమ్మ ఊరుతోంది.

తలుపులు బిగించడంతో, మిట్ట మధ్యాహ్నమైనా ఆ రెండు గదుల చిన్న ఇంట్లో మసక చీకటి పరచుకునుంది. పైన తిరుగుతున్న ఫ్యాను రెక్కల్ని తదేకంగా చూస్తున్న ఆమె కళ్లలో, ఊరిన చెమ్మ మెల్లగా నీటి బిందువులుగా మారి జాలుకట్టి కనుకొలుకుల్లో నుండి చెంపల మీదికి జారుతోంది.

నిర్జీవమైన తన గాజుకళ్లలో ఇంకా నీరుందా?... చెంపల మీద జారిన కన్నీళ్లను తుడుచుకుంది.

పరిస్థితులు బలవంతంగా తోసుకుపోతుంటే, విచక్షణ లేనితనంతో తను తాళం తప్పి గతులు వేసిందా! తను నేర్చుకున్న నాట్యకళ కూడా గతి తప్పుతున్న అడుగులను నిలువరించలేకపోయిందనుకుని కల్పన నిట్టూర్చింది.

శారీరకంగా ఆకట్టుకునే అందం ఉన్న తను మానసికంగా అనాకారినా? తనలో మానసిక వైకల్యం రూపుదిద్దుకుందా? అన్న సందేహం కల్పనలో ఈ నడుమ అప్పుడప్పుడూ కదులుతోంది.

వెనువెంటనే, అలా అనుకోవడానికి కల్పనలోని అహం అంగీకరించడంలేదు.

ఈ నలభై రెండేళ్ల జీవితంలో గతించిన జీవితం పట్ల తనకు పశ్చాత్తాపం ఏమీలేదు. తను నడిచిన దారి తనకు అవసరం. ఇతరులు అనుకునే అనైతికాలు తనకు నైతికం ఎందుకు కాకూడదు? తన బిడ్డను తీర్చి దిద్దేందుకు ఉపయోగపడినదే తనకు నైతికం. ఒంటరి ఆడదాన్ని కాకుల్లా పొడుచుకు తినే లోకంలో తన జీవితం ఏమైనా, బిడ్డ జీవితాన్ని ఒక దరికి చేర్చాలనుకుంది... చేర్చింది. అదే తనకు నైతికం.

కానీ... ఇప్పుడు ఆ బిడ్డే తనను మనిషిలా కాకుండా, ఆమెకు అన్నీ సమకూర్చి పెట్టే యంత్రంలా చూస్తోందా!... ఎక్కడ లోపం జరిగింది?...

కల్పనలో ఎడతెగని ఆలోచనలు... ఎక్కడికక్కడ తెగిపోతున్న ఆలోచనలు.

వేసుకున్న నిద్రమాత్రల ప్రభావం మెదడుకెక్కి కళ్లు మూతలు పడుతుండగా... ప్రక్కనే ఉన్న సెల్‌ఫోన్ మోగింది. తీసుకొని చూసింది. గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ మదన్మోహన్‌రెడ్డి... మాట్లాడాలా? వద్దా? అనే మీమాంసలో మొబైల్ ఫోన్ చూస్తూ పడుకుంది. కొద్దిసేపటికి రింగ్ ఆగిపోయింది. ఒక్కక్షణం తరువాత మళ్లీ మోగింది. వీడు పంపిణీ చేస్తున్న కంపెనీ గ్యాస్ కనెక్షన్లు రెండు తన పేరున, కూతురు పేరున అడిగింది. తప్పక చేస్తానన్నాడు. ఫోటోలు అవీ, అడిగిన కాగితాలన్నీ ఇచ్చింది.

అప్పటి నుండి, 'ఇంట్లో ఒక్కదానివే ఉంటావు కదా? ఒకరోజైనా ఇంటికి పిలవొచ్చు కదా!' అని రోజూ ఫోన్‌లు... ఏదో ఒకటి చెప్పి తప్పించుకుంటోంది తను.

'ఇంక వీడి గ్యాస్ కనెక్షన్ వద్దు- వీడూ వద్దు. వీడి ఫోన్‌ను 'బ్లాక్‌లిస్ట్'లో పెట్టా,'లనుకుంటూ... సెల్ పట్టుకుని ఆ పనిలో మునిగిపోయింది.

అందమైన ప్రౌఢ కడుపు కనిపించేలా చీర కట్టి, పళ్లికిలిస్తూ, అవసరమనుకుంటే చేయి తాకిస్తూ మీద పడి మాట్లాడితే అలవోకగా పనులు జరుగుతాయని కల్పనకొక నిశ్చితాభిప్రాయం.

ఈ నడుమ అలా ప్రవర్తించడానికి తనకు మన సొప్పడంలేదు. ఇన్నేళ్లూ ఏమాత్రం పట్టింపుగా తీసుకోని మగవాళ్ల చూపులు, పళ్లికిలింపులు, వెకిలి మాటలు ఇప్పుడు భరింపశక్యం కావడంలేదు.

శివారెడ్డి పరిచయమైన ఈ రెండేళ్లలో తనూ ఓ ఇల్లాలి హోదా అనుభవిం చింది. మగరాయుడిలా వీధిన పడాల్సిన పని లేకుండా, ఇంట్లో కూర్చోబెట్టి అన్ని పనులూ ఆయనే చక్కబెట్టాడు. జీవితంలో తను కోల్పో యిన 'భార్య' భావనను మళ్లీ తనలో చిగురింపజేశాడు. నటనలతో అలసిపోయున్న తనలో, ఒక భార్యలా జీవి తాన్ని జీవించాలనే ఆశలు రేకెత్తించాడు.

ఇప్పుడు కూతురు తననా జీవితం వైపు పోవద్దం టోంది. తనకంటూ ఓ జీవితముందనే ఊహను దరిచేర నీయకుండా, కూతురే సర్వస్వం అనుకున్న తనకు, ఇప్పుడు కూతురు మాటలు, చేతలు తీవ్రవేదనను రేపు తున్నాయి.

గడిచిన జీవితం ముక్కలుముక్కలుగా కొనా మొదలు లేకుండా జ్ఞాపకాల్లోకి వచ్చిపోతోంది. నిద్ర మాత్రల మత్తు తలకు ఎక్కుతుండగా మగతగా కళ్లు మూసుకుంది.

*

తన తండ్రి పెళ్లికాక ముందే చిన్న వయస్సులోనే ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్‌గా చేరి, తను పుట్టి, స్కూల్లో చేరే వయస్సునాటికే ఎస్ఐగా మారాడు. పుట్ట గానే తల్లిని పొగొట్టుకున్న కూతురు మీద ఆయనకు వల్లమాలిన అభిమానం. తన తల్లి చెల్లెలినే మళ్లీ పెళ్లి చేసుకొని మరో కొడుకును, కూతురిని కన్నా, ఆయనకు తనంటేనే గాఢానురక్తి. అప్పట్లో తండ్రి ప్రేమ, గారాబం వల్ల సవతి తల్లి పక్షపాత బుద్ధి తనకు అవగతమయ్యేది కాదు. అదీగాక తాను హైస్కూల్ చదువుకొచ్చేసరికి ఇంటికి దూరంగా మద్రాసులో పెట్టి, చదువుతోపాటు డ్యాన్స్ అకాడమిలో చేర్చారు.

తండ్రికి సినిమా వాళ్లతో ఉన్న సంబంధాలు... తన అందం... అన్నీ కలిసి తనను సినిమా హీరోయిన్‌ను చేయాలనే సంకల్పానికి తండ్రిని పురిగొల్పాయి. డ్యాన్స్ నేర్చుకొనే సమయంలోనే, తండ్రికున్న పరిచయాల వల్ల రెండు, మూడు సినిమాల్లో బాలనటిగా నటించింది. కొందరు సినీ ప్రముఖుల దీవెనలతో, సొంత ఊళ్లో తనతో ఆరంగ్రేటం చేయించి స్టేజి మీద ప్రదర్శన ఇప్పిం చాడు తండ్రి.

ఆ తరువాత ఇంట్లో నాన్నకు, పిన్నికి ఏం గొడవలు జరిగాయోగానీ తన పదహారవ ఏట మద్రాసు నుండి సొంత ఊరికి రప్పించారు. సొంత ఊళ్లో మామూలు చదువు, ఒకటి, రెండు స్టేజి ప్రదర్శనలు మినహా... తను కన్న రంగుల కలల ప్రపంచం కళ్ల ముందే కరిగిపోయింది.

పినతల్లి పక్షపాత ధోరణి క్రమక్రమంగా అర్థ మయ్యేకొద్దీ అది మరింత ఎక్కువవుతున్నట్లు అని పించి... చివరకు భరింపరానిదైపోయింది.

తన తమ్ముణితోపాటు తమ ఇంటికి వచ్చే... వయసులో తనతో సమానమైన మహేష్‌తో చూపులు కలిపింది. తన పద్దెనిమిదవ యేటనే అతన్ని తీసుకొని చిత్తూరు జిల్లాలోని అతని స్వగ్రామానికి వెళ్లిపోయింది.

అప్పటికి ఎక్సైజ్ సిఐగా ఉన్న తండ్రి వారం రోజు ల్లోనే తమ ఆచూకీ కనుక్కొని ఇంటికి తీసుకొచ్చి పెళ్లి చేసినాడు. ఆస్తిపాస్తులు ఏమీలేని, చదువుసంధ్యలు అంతగా లేని మహేష్‌ను తమ ఇంట్లోనే ఉంచు కున్నాడు తండ్రి.

మహేష్‌ది చపలచిత్తం... ఓ ఆరునెలలు అంద మైన భార్యతో స్వర్గం రుచి చూసి ఆ ఇంట్లో ఇమడ లేనంటూ ఏటో వెళ్లిపోయాడు. తన తండ్రి వెదికి తెచ్చి పెట్టాడు... నెలరోజులకు మళ్లీ మాయం... మళ్లీ వెతికి తేవడం... మళ్లీ మాయం... రెండేళ్లపాటు ఇదే వరుస.

ఒకసారి ఏడాది చంటిబిడ్డను వదిలి మళ్లీ మాయం. వెళ్లిన వాడింక తిరిగిరాలేదు... తను వెదకడం మానేసింది. ఆ తరువాత రెండేళ్లకెపుడో తెలిసింది... మహేష్ ఈ లోకంలోనే లేడని.

తనకు కన్నీళ్లు కూడా రాలేదు... దేశదిమ్మరి ముండాకొడుకు, అశాంతి తప్ప ఏమిచ్చాడు! పోతేపోనీ! కూతురే తనకు లోకమనుకుంది. తనను గొప్ప తల్లిగా గుర్తించేలా తను గర్వపడేలా కూతురిని పెంచి తీర్చిదిద్దా లనుకుని శపథం చేసుకుంది.

తాళిబొట్టు, గాజులు తీసే కార్యక్రమేదీ జరగ లేదు. తనను నిత్య సుమంగళిగా చేతులనిండా గాజు లతో, తలనిండా పూలతో చూడాలని నాన్న కోరిక. తనకూ అవంటే చచ్చేంత ప్రాణం.

*

ఎవరో తట్టి లేపినట్లు మెలుకువ వచ్చింది కల్పనకు. ప్రక్కనే ఉన్న సెల్‌ఫోన్ మోగుతోంది... చూసింది... ఎవరిదో కొత్త నంబర్... ఎత్తకుండానే ప్రక్కన పడేసింది.

మెల్లగా మంచం మీద నుండి లేచింది. గడి యారం 5.30 సూచిస్తోంది.

బాత్‌రూమ్‌కు పోయి వచ్చి స్టౌ మీద కాఫీకి పడే సింది. సెల్‌ఫోన్ తీసుకొని, కోయంబత్తూరులో వాళ్ల పిన్ని, బాబాయిల ఇంటికి పోయిన కూతురికి ఫోన్ చేసింది. రింగ్ మోగి మోగి ఆగిపోయింది.

రెండవసారి... మూడవసారి... కల్పనకు అలవి కాని అసహనం కట్టలు తెంచుకుంది. 'పాడు లంజ ముండ! దీనికి తల్లంటే పట్టదు,' అని గొణుక్కుంది.

ఇంతలో ఫోన్ మోగింది. కూతురు... కోపాన్ని గొంతులోనే అణిచి, "ఏమ్మా! ఇన్నిసార్లు చేసినా ఫోనె త్తవు?" అంది నిష్ఠూరం నిండిన అనునయంతో.

కూతురు ఎదిగేకొద్దీ ఆమెను ఎదురుగా ఒక్క మాట అనలేని బలహీనత కల్పనలో రోజురోజుకు ఎక్కు వవుతోంది.

"ఏం, నీ మాదిరి పనీపాటా లేకుండా ఉన్నారను కున్నావా?" కూతురు గొంతు ఖణేల్‌మంది... ఒక్కక్షణం కల్పన నిస్పృహను దిగమింగింది. 'సర్లే, పెళ్లిచూపులకు వాళ్లొచ్చారా?' అనడిగింది.

"సాయంత్రం ఆరుగంటల తరువాత వస్తామన్నా రని ఎన్నిసార్లు చెప్పాలమ్మా నీకు. ఇక్కడ పొద్దున్నుండి పిన్ని, బాబాయిలతో నీ గొడవే. మీ అమ్మ విషయం ఏం చెప్పాలని బాబాయి అడుగుతున్నాడు. 'నీకు చదువయి పోయి, పెళ్లి చేయాల్సిన టైంలో నిన్ను చూసుకుంటూ కృష్ణారామా అనుకోకుండా, మళ్లీ ఎవరో శివారెడ్డితో ఉంటోందంట కదా! ఒకరా, ఇద్దరా? మనం దాచినా బయటపడకుండా ఉంటుందా? ఇలా అయితే నీకు పెళ్లి కావాలంటే మాటలతో అవుతుందా?' అని బాబాయి అడుగుతున్నాడు..." గుక్క తిప్పుకోకుండా కూతురు గొంతు నిలదీస్తుంటే, ఇవతల కల్పన నిశ్చేష్ఠ రాలైపోయింది ఒక్క క్షణం.

"అన్నీ నీకు చెప్పే చేశాను కదమ్మా! మీ తాతయ్య సంపాదించింది సంపాదించినట్లు ఖర్చు చేసి వెళ్లిపోయి నాడు. అంతో ఇంతో ఉన్నది మీ పిన్ని పెళ్లికి సరిపో యింది. మీ అమ్మమ్మ, మామయ్య అందరూ మీ పిన్నితో పాటే కోయంబత్తూరు వెళ్లిపోయి, నన్ను ఇక్కడ దిక్కులేనిదానిగా నిలబెట్టి పోయినారు. మీ నాన్న నిన్ను పురిట్లోనే వదిలేసి దేశాలు పట్టిపోయి నా బతుకు ముండమోయిచ్చినాడు. ఒంటి ఆడదాన్ని, ఈరోజు నిన్ను బి.టెక్ చదివించి, నీకు 30-40 లక్షలు చేసే ఇంటి స్థలాలు, 30 తులాల బంగారు, 5 లక్షలు డబ్బు కూడ బెట్టడమంటే మాటలతో అయ్యేపనా? అయినా ప్రతిదీ నీకు చెప్పే చేసినా కదమ్మా! ఇప్పుడు కూడా, నువ్వు వద్దన్న తరువాత ఆయనతో, ఆయన భార్యాబిడ్డలతో గొడవ పెట్టుకొని ఆయప్ప మనసు విరిగిపోయేలా ప్రవర్తించినాను. మూణ్నెళ్ల నుండి రావడం లేదు కదా!" జీవితంలో ఎవరికీ సంజాయిషీలు చెప్పని కల్పన, సంజాయిషీ గొంతుతో కూతురికి చెప్పుకుంది.

జీవంలేని కల్పన కళ్లు శూన్యంలోకి చూస్తు న్నాయి.

"సరేలే! నేను లేకపోతే నీకు వాడి మీదనే గాలి. ఫోన్‌చేసి పిలిపించుకుంటావ్. ఇప్పట్నుంచైనా బాబాయ్, పిన్ని, నేను చెప్పినట్లు విను. నేను తరువాత ఫోన్ చేస్తా," అంటూ, జవాబు ఆశించకుండా ఆవతల ఫోన్ కట్ చేసిన శబ్దం.

కల్పన నిట్టూర్చింది. మెల్లగా లేచి వంటింట్లోకి నడిచింది. స్టౌ మీద చూస్తే కాఫీకి పెట్టిన నీళ్లన్నీ ఇగిరి పోయి పాడి మిగిలి వుంది... వెంటనే మళ్లీ నీళ్లు పోసి కాఫీ పెట్టుకుంది.

పెద్దగ్లాసుకు పోసుకుని, కుర్చీలో రెండు కాళ్లు మడిచి పైకి పెట్టుకుని తాపీగా తాగుతుంటే... కల్పనలో మళ్లీ ఆలోచనల ముసురు.

*

మహేష్ అంతర్థానమై పోయింతరువాత, ఇంట్లో పిన్ని సూటిపోటి మాటలు, బాధలు తను భరించలేక పోయింది. పిన్ని విషయంలో నాన్న కూడా అశక్తుడు కావడం మరింత క్షోభపెట్టింది తనను. సహించలేక చంటిపిల్లను తీసుకొని మరో అద్దె ఇంటికి మారింది. తను నేర్చుకున్న చేతికళలనే ఉపాధిగా చేసుకుంది. కాన్వాస్‌పై పూసలతో, ముత్యాలతో దేవుళ్ల రూపాలను తయారుచేసి ఫ్రేమ్ కట్టించేది. 'లేపాక్షి' సభ్యత్వం తీసుకొని తాను తయారుచేసిన చేతిపని కళారూపాలను లేపాక్షి ఎంపోరియంకు సరఫరా చేసింది. ఇంట్లో కుట్టు మిషన్ పెట్టుకుంది. మధ్యమధ్యలో పోస్టల్‌లో, ఎక్సైజ్ శాఖలో టైపిస్టుగా చిన్న చిన్న ఉద్యోగాలు చేసింది. కూతురి ఆలనాపాలనకు అడ్డు కావడంతో వాటిని మధ్యలో వదిలేసింది. తండ్రి వచ్చి ప్రతిరోజూ చూసిపో తుండేవాడు.

ఒకరోజు తండ్రి 30 వేలు డబ్బిస్తే తీసుకుంది. ఆ డబ్బు విషయమై ఇంట్లో నాన్నతో, పిన్ని పెద్ద గొడవకు దిగిందని తెలిసింది. నాన్న రెండు రోజులు తన దగ్గరకు రాకపోయేసరికి... ఆ నోట్ల కట్టలను తీసుకుపోయి, గేట్లో నుండే ఇంట్లోకి పిన్ని మొహాన విసిరికొట్టి వచ్చింది.

మహేష్ రుచి చూపించిన 'శరీర సుఖం' అప్పు డప్పుడూ గుర్తొచ్చి యవ్వన తాపాన్ని పెంచేది... నిద్రలేమి

రాత్రులను మిగిల్చేది... దాన్నుండి బయటపడేందుకు మెల్లగా నిద్రమాత్రలను ఆశ్రయించింది.

బిడ్డను స్కూల్లో చేర్పించడం... బిడ్డ కోసం స్కూలుకు వెళ్లి రావడం... తన బిడ్డ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పదేపదే టీచర్లను అడుక్కోవడం... బిడ్డను ఎవరైనా టీచర్ కొట్టిందని తెలిస్తే, ఆ టీచర్‌తో కొట్లాటకు దిగి తీవ్రస్థాయిలో అసభ్యంగా తిట్టడం... స్కూల్ మొత్తాన్ని దుమ్మెత్తిపోయడం... అంతలోనే వాస్తవం గ్రహించిన దానిలా హెడ్‌మాస్టర్ దగ్గర అనునయంగా మాట్లాడుతూ... బిడ్డను కొట్టిన టీచర్‌పై హెడ్మాస్టర్‌కు చాడీలు చెబుతూ తనను తాను సమర్థించుకోవడం... బిడ్డ కోసం షాపింగ్... ఇలా అన్నీ తానై బిడ్డ కోసం ఒంటరి బ్రతుకుపోరు ప్రారంభించింది. తన ప్రవర్తనలో తన ప్రమేయం లేకుండానే మానసిక చపలత్వం ఆవహించడం తనకు తెలుస్తూనే ఉంది. అయినా నిగ్రహించుకోలేని బలహీనత.

ఆ కాలం నుండే, తనకు కావాల్సిన పనులు, కాణీ ఖర్చు లేకుండా చేసుకునేందుకు అందరితో నవ్వుతూ, తుళ్లుతూ మాట్లాడటం అలవాటు చేసుకుంది. చుట్టూ ఉన్న సమాజమే తనకు అలవాటు చేసింది.

తను పుట్టిన పెరిగిన వాతావరణం... తండ్రి గారాబం వల్ల వచ్చిన ఆధిపత్యధోరణి... నాట్యకళ... మద్రాసు నగర జీవితం... వీటివల్ల తనకు 'బ్రతకడానికి కావాల్సిన ధైర్యం', 'బ్రతకనేర్చినతనం' సులభంగానే వంటపట్టాయి.

కూతురికి ఎనిమిదేళ్లొచ్చేసరికి నిద్రమాత్రల ప్రభావం తన ఆరోగ్యం మీద దెబ్బతీస్తూ వచ్చింది. ఒంటిని నిస్సత్తువ ఆవహించింది. కూతురుకు వంటచేసి స్కూలుకు పంపడమే భారంగా మారింది. తను నేర్చిన చేతి కళారూపాలు చేసే ఓపిక నశించిపోయింది. అంత అనారోగ్యంలోనూ తన అందం సడలకపోవడం తనకు గర్వంగా తోచేది.

ఎదురింట్లో కొత్తగా చేరిన ప్రసాద్ తనను తదేకంగా చూస్తూండడం గమనించింది. అతను తల్లితో, పుట్టింటికి చేరిన అక్కతో కలిసి ఉండేవాడు. అతను వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగం చేస్తున్నాడని తెలుసుకుంది. వాళ్ల పరిచయం ద్వారా తన అనారోగ్యానికి మందుల ఖర్చు తగ్గుతుందనుకుంది.

ఓరోజు తాను అంతులేని నీరసంతో పడిపోయి ఒకరోజంతా బయటికి రాకుండా మంచం మీద పడిపోయింది. మరుసటి రోజు ఉదయమే ప్రసాద్ నేరుగా ఇంట్లోకి వచ్చాడు- 'మా అమ్మ చెప్పిం'దంటూ.

తనకు ఇంట్లోనే 'సెలైన్' ఎక్కించే ఏర్పాటు చేశాడు. ఏవో మందులు తెచ్చిచ్చాడు. ఉదయం, సాయంత్రం వచ్చి చూసిపోయేవాడు.

మెల్లగా నుదుటి మీద, కడుపు మీద చేయివేస్తూ చొరవ తీసుకున్నాడు. తనలోనూ మహేష్ మిగిల్చిపోయిన 'తాపం' మళ్లీ అంటుకుంది. అంతకన్నా ప్రధానంగా, తను సంపాదించలేని దైన్యస్థితి గుర్తొచ్చింది... ప్రసాద్‌కు అడ్డుచెప్పలేదు.

ఎనిమిదేళ్ల కూతురికి నచ్చచెప్పుకుంది. 'మనకు డబ్బు కావాలి కదమ్మా! నేను ఏ పని చేయలేను. నువ్వు పెద్ద పెద్ద చదువులు చదివి పెద్ద ఆఫీసర్ ఉద్యోగం చేయాలి. నిన్ను పెద్ద ఆస్తి ఉన్న వాళ్లింటికిచ్చి పెళ్లి చేయాలి. ఇవన్నీ జరగాలంటే డబ్బు కావాలి కదమ్మా!' అంటూ అనాలోచితంగా కూతురి మనసులో 'డబ్బు బీజం' నాటింది.

ఆ బీజం మొలకెత్తి మొక్కై, మానై కూతురిని స్వార్థం మూర్తీభవించిన మనిషిగా మారుస్తుందని తను అప్పట్లో ఊహించలేకపోయింది.

ఇంట్లోనే నాలుగు గోడల నడుమ, ప్రసాద్ తల్లి, అక్కల సమక్షంలో అతనితో తాళి కట్టించుకుంది. ఈ విషయం తండ్రికి, పిన్నికి, తమ్మునికి తెలియజేసింది... వాళ్లు వచ్చి చూసివెళ్లారు...

'తన బిడ్డ బ్రతుకు ఏ మలుపులు తిరుగుతుందో...'నని ఆ తండ్రి కళ్లనీరు పెట్టుకొని వెళ్లిపోయాడు.

పెళ్లైన మరుసటిరోజే ప్రసాద్ ఇంటి మీదికి ఒక స్త్రీ, ఆమె బంధువులు వచ్చి రభస చేశారు. ఆ వచ్చిన ఆమె ప్రసాద్ మొదటి భార్యట... ఆమెకు ప్రసాద్ వల్ల, ఒక కూతురు కూడా ఉందట... ఆమెను వదిలేశాడట.

మొదటి భార్య విషయం చెప్పకుండా తన జీవితాన్ని ఆక్రమించిన ప్రసాద్ మీద, సహజంగా స్త్రీకి రావాల్సిన వ్యతిరేకభావం తనకు రాలేదు. ఆ మొదటి భార్య మళ్లీ ప్రసాద్ దగ్గరకు చేరకుండా, అతన్ని తన చుట్టూ తిరిగేలా కట్టేసుకోవాలనే 'అహం' పురివిప్పింది. అలా అని తీర్మానించుకుంది.

ప్రసాద్‌తో వేరుకాపురం పెట్టింది. అతను తెచ్చిచ్చే డబ్బులో మిగుల్చుకుని, తన దగ్గరున్న డబ్బుతో కలిపి బయట వడ్డీలకు ఇవ్వడం నేర్చుకుంది.

ఒకరి మీద ఒకరికి అనుమానాలు, గొడవలతోనే కాపురం సాగింది. అయినా రాత్రి మంచం మీద శరీర

తాపాలను చల్లార్చుకుంటూ సంవత్సరం గడిచింది. ఏడాది కాగానే ప్రసాద్ 'తమ మధ్య ఆ పాప ఎందుకు?' అనే కొత్త పల్లవి ఎత్తుకోవడంతో... ఇన్నాళ్లూ డబ్బుకోసం, సుఖం కోసం భరించిన తనకు, బిడ్డపై శత్రుత్వం పెంచుకుంటున్న ఆ మనిషి శత్రువుగా కనిపించసాగినాడు. అయినా తెంచుకోకూడదని బిడ్డను అదే ఊరిలో మంచి రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించింది. ప్రతిరోజూ పోయి చూసి వచ్చేది.

అడ్డుగోడలు కట్టుకుంటూ... కూల్చుకుంటూ... మళ్లీ కట్టుకుంటూ... ప్రసాద్‌తో మరో నాలుగేళ్లు కలిసుంది. ఈ నాలుగేళ్లలో ప్రసాద్ అసలు స్వరూపం కథలు కథలుగా తన చెవికొచ్చిపడింది. అతనొక 'స్త్రీలోలుడ'నీ, తను పనిచేసే చోట నర్సులతోను, ఇతర స్త్రీలతోనూ సంబంధాలు పెట్టుకున్నాడనీ వివరాలు సేకరించింది. అయినా అతన్నుండి, తన భద్రత కోసం వీలైనంత ఎక్కువ డబ్బు గుంజుకోవడమే పరమావధిగా నాలుగేళ్లు లాక్కొచ్చింది.

అతనికీ తనమీద ఏవేవో అనుమానాలున్నాయి. ఇద్దరూ గొడవ పడేటపుడు, ఒకరి గురించి ఒకరు చుట్టుప్రక్కల వాళ్లకు తెలియని విషయాలు కూడా తెలిసేలా గట్టి గట్టిగా అరుచుకుంటూ కొట్టుకునే స్థాయికి చేరారు.

ఈ కాలంలోనే చెల్లెలు, తమ్ముడి పెళ్లిళ్లు అయిపోయాయి. రిటైర్ అయిన తండ్రి మరణించాడు. తన కూతురి భవిష్యత్తుమీద మనోవేదనతోనే కన్నుమూశాడు.

ఒకరోజు కూతురు హాస్టల్ నుండి ఇంటికొచ్చిన రోజు... ప్రసాద్ వచ్చేసరికి తను ఇంట్లో లేదు. బిడ్డ వుండటంతో, రాగానే రాక్షసుడిలా మారి మీద పడ్డాడు.

"నీ బిడ్డ ఇంటికి వచ్చిన రోజు కూడా నీవు ఇంట్లో ఉండలేవా? ఒక్కరోజు రాసలీలలు లేకుంటే తట్టుకోలేవా?" అంటూ బజారులోనే చీర ఊడేలా కొట్టాడు. ఊడిన చీరతోనే ఇంట్లోకి పరుగెత్తింది. అడ్డు వచ్చిన కూతురు తలమీద, చేతిలో వున్న కట్టెతో మోదాడు. ఆ పాప తల పగిలి నెత్తురుధార కట్టింది...

కూతురి భవిష్యత్తు కోసం రాయిలా మారి దేన్నైనా, ఎవరినైనా సహించగలదు తను. అదే కూతురికి ప్రమాదం తలపెడితే, అవతల ఎంత దగ్గరి మనిషైనా సహించలేదు... తను రెచ్చిపోయింది. అపరకాళిలా మారింది. ఇరుగుపొరుగు చూస్తుండగానే వాన్ని కాళ్లతో తన్ని తగలేసింది. కూతురిని తీసుకొని నేరుగా పోలీస్ స్టేషన్‌కు పోయి కేసుపెట్టింది.

పోలీస్‌స్టేషన్‌లో కేసు గొడవలు చూసేందుకు తనకు తోడుగా, తన పుట్టింటి ఎదురుగా ఉన్న పరిచయస్తుడు అజ్మతుల్లాను ఆశ్రయించింది.

అజ్మతుల్లా, ఎస్సై కలిసి పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు పంచాయతీ చేసి ప్రసాద్‌గాడి నుండి కొంత డబ్బు రాబట్టి తనకు ఇప్పించారు.

ఆ చొరవతో అజ్మతుల్లా తనమీద అధికారం చలాయించే ప్రయత్నం చేసినాడు. వాడిని తప్పించుకొనేందుకు ఇల్లు మారింది.

తన దగ్గరున్న డబ్బును, దూరపు బంధువులు, పరిచయస్తుల దగ్గర అధిక వడ్డీలకిచ్చింది. డబ్బు లావాదేవీల విషయమై తరచూ వెళ్లిరావాల్సిన పరిస్థితుల్లో... ప్రతివాడూ తనను 'ఒక్కసారైనా' కావాలనుకున్నవారే. ఆ కోరికను కొందరు పచ్చిగానూ, మరికొందరు నర్మగర్భంగానూ బయటపెట్టినవారే.

తను ఎవనికి లొంగకపోతే- వాడు, తను వాడి దగ్గర పడుకుంటోందని అక్కడా ఇక్కడా వాగడం మొదలుపెట్టినారు.

'తన వెనక ఎన్ని కూసుకుంటే తనకేం?' అనుకునే ఒక బండమనిషిగా మారిపోయింది.

ఇల్లు మారేందుకు సహకరించిన తన దూరపు బంధువు నారాయణ అప్పుడప్పుడు ఇంటికి వస్తూపోతుండేవాడు. నిద్రమాత్రల ప్రభావంతో ఒకరోజు పూర్తిగా కోమాలోకి పోయిన సమయంలో, అతనే తనను సైక్రియాటిస్టుకు చూపించాడు. దాదాపు పదహారేళ్ల నుంచి నిద్రమాత్రలకు అలవాటుపడ్డానని తెలిసి డాక్టర్ ఆశ్చర్యపోయాడు. తన జీవితాన్ని విని, మానసికంగా చాలా దెబ్బతిన్నావన్నాడు. మామూలు మనుషుల్లో వుండే కోపం, దయ, ప్రేమ, తాపం వంటి అనుభూతులు ఆయా సందర్భాలలో కొన్ని పూర్తిగా కనుమరుగవుతూ, కొన్ని తీవ్రతరమవుతుంటాయన్నాడు. ఇవి ఒకేతీరుగా ఉండకుండా చపలమవుతూ అటూ ఇటూ అవుతుంటాయన్నాడు... కోలుకోవడం కష్టమన్నాడు.

డాక్టర్ రాయించిన ఇతర మందులను కొన్నాళ్లు వేసుకుని మానేసిందిగానీ, నిద్ర కోసం రాయించిన మాత్రలను కొనసాగించింది.

నిద్రమాత్రల మత్తులో ఉన్నప్పుడే, ఇంటికొస్తూపోతూ ఉండిన తనకన్నా ఒకటి, రెండేళ్లు చిన్నవాడైన నారాయణ తనను ఆక్రమించుకున్నాడు. తన శరీరమూ 'మగస్పర్శ' కోరుకుందేమో, మత్తులో గట్టిగా ఎదుర్కొలేక పోయింది.

నారాయణ విషయంలోనూ, కూతురికి 'డబ్బు అవసరం తీరే మార్గం'గానే నచ్చజెప్పుకుంది. తన మాటల ప్రభావంతో కూతురిలో డబ్బు బీజం మొలకెత్తి మొక్కగా పెరుగుతోందని తను గ్రహించలేకపోయింది.

పోస్టల్‌లో మంచి ఉద్యోగంలో ఉన్న నారాయణ, డబ్బు విషయం వచ్చేసరికి చేతులు పిసుక్కుంటూ పినాసితనం చూపడం గ్రహించింది తను. అయినా ఓపిక పట్టింది... తన కూతురు మీద కూడా అతనికి కన్నుందనే అనుమానం కలిగింది. అంతే అతన్ని చెడామడా తిట్టి, కొట్టి, ఇంటికి రావద్దని హెచ్చరించింది.

నారాయణగాడ్ని దూరంగా పెట్టాలనుకున్న తర్వాత, ఇంటిపట్టున ఎక్కువ కాలం గడపకుండా ఉండేందుకు తాను అధికార రాజకీయ పార్టీలో చేరి, 'సామాజిక కార్యకర్త'గా మారి ఏదో వ్యాపకం కల్పించుకుంది. రాజకీయ సమావేశాల్లో పాల్గొంటూ, తమ డివిజన్ లో ఉన్న పేదల పనుల కోసం రెవెన్యూ, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరిగి అధికారులను కలవడం వ్యాపకంగా పెట్టుకుంది.

నారాయణ వినకుండా ఇంటికి వస్తుండటంతో, అతని భార్యకు ఫోన్‌చేసి తమ సంబంధం చెప్పి వాళ్లిద్దరికీ గొడవపెట్టి తన వద్దకు రాకుండా చేసుకుంది.

*

సెల్‌ఫోన్ మోగింది... వెంటనే కల్పన గతం నుండి ఇహంలోకి వచ్చింది.

చేతుల్లో సగం ఖాళీ అయిన గ్లాసులో కాఫీ చల్లారిపోయి ఉంది. సెల్‌ఫోన్ అందుకుని చూసింది... ఇంతకు ముందు వచ్చిన కొత్త నంబరే. "హలో," అంది.

"హాయ్, నేను ఆలంవల్లీ..." అంది ఆవతలి గొంతు. "మీ ఊరికి వచ్చాను. స్టేట్ గెస్ట్‌హౌస్‌లో వున్నా," అన్న మాటలు వినిపించాయి నర్మగర్భంగా.

"నేను ఊర్లో లేను. చిత్తూరులో ఉన్నా," అంది కల్పన. ఇక మాట్లాడాలనిపించలేదు. 'ఆ... ఊ...' అంటూనే కట్ చేసింది.

రెండేళ్ల క్రితం తను రాజకీయాల్లో తిరిగిన ఏడాది కాలంలో ఇలాంటి వాళ్లెందరో తగిలారు. కార్పొరేషన్ పరిధిలో ఎక్కడైనా మంచి ఏరియాలో ఇంటిస్థలం పట్టా చేయిస్తానంటూ ఆశపెట్టి జొళ్లు కార్చుకునేవాడు వీడు. రాయించినపుడు చూద్దాంలే అనుకొని దూరం దూరంగానే జరుగుతూ తప్పించుకుంది. వీడు ఇక్కడి నుంచి బదిలీ అయిపోయినా, అప్పుడప్పుడు ఫోన్లలో జొళ్లు కార్చుకుంటూనే ఉన్నాడు.

ఎంత తప్పించుకుందామన్నా, గతంలో తన ప్రవర్తన వల్ల ఇలాంటి ఫోన్లు వెంటాడుతూనే ఉన్నాయి. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుంది.

చల్లారిన కాఫీ తీసుకుపోయి స్టౌ మీద పెట్టి వేడి చేసుకుని గబాగబా తాగి, గ్లాసు కడక్కుండానే స్టౌ బండ మీద పడేసింది.

కల్పనకెందుకో ఈరోజు శివారెడ్డే జ్ఞాపకం వస్తున్నాడు. మొహం మీద నీళ్లు చల్లుకుని, పైపైన తల దువ్వుకుని సమీపంలోనే, ఊరికి చివరగా ఉన్న కాలేజి మైదానంలోకి నడిచింది నీరసంగా.

మైదానంలో తను, శివారెడ్డి ఎన్నోసార్లు కూర్చుని, మనసులు విప్పుకున్న రాతి బెంచీ మీద కూర్చుంది. శివారెడ్డి తన ప్రక్కనే ఉన్నట్లనిపించి, మనసుకు కొంచెం ఊరట వచ్చింది. మహేష్ తర్వాత మళ్లీ ఇరవై ఏళ్లకు, తనకు తానుగా తన జీవితంలోకి ఆహ్వానించింది శివారెడ్డినే.

తను రాజకీయాల్లో చేరి, ఇతరుల పనులకోసం అధికారుల చుట్టూ తిరిగే క్రమంలో కొత్తగా రెవెన్యూ కార్యాలయానికి అధికారిగా వచ్చిన శివారెడ్డి గంభీరంగా, గుంభనంగా కనిపించాడు.

అంతవరకూ తన అందానికీ, నవ్వుకూ, స్పర్శకు దాసోహమన్న మగప్రపంచంలో శివారెడ్డి కొత్తగా కనిపించాడు.

తను అతని వద్దకు వెళ్లిన తొలిరోజే, తను చెప్పేది వినకుండానే... నిర్లక్ష్యంగా తనను క్రిందిస్థాయి ఉద్యోగులకు అప్పగించి, 'ఈమె పనేదో చూడండి,' అన్నాడు. ఆ తరువాత ఎంత ప్రయత్నించినా తనను ఏ రోజూ ఒక్క నిమిషం కూడా మాట్లాడనిచ్చేవాడు కాదు. అసలు తన మొహంలోకి చూసి మాట్లాడేవాడు కాదు.

అప్పుడతని విషయాలపై ఆరా తీసింది. నిజాయితీపరుడని, భార్య, ఇటీవలే పెళ్లైన కూతురు, ఇంజనీరింగ్ చదువుతున్న అబ్బాయి ఉన్నారని తెలుసుకుంది. తనకన్నా ఏడెనిమిదేళ్లు పెద్దవాడు. ఆడవాళ్లతో చాలా జాగ్రత్తగా ఉంటాడనీ, ఎవరి విషయాలు పట్టించుకోడని విన్నది.

ఇంతవరకు తన జీవితంలోకి చొరబడిన ప్రసాద్, నారాయణలిద్దరూ స్త్రీ లోలులే. తనను అనుభవించే అవకాశం కోసం చూస్తున్న అనేకమంది మగవాళ్లు కూడా అలాంటివాళ్లే. తన పనులు నెరవేర్చుకోవడంలో తన గొప్పదనం, తన అందం పని చేస్తున్నాయని అంతవరకూ అనుకుంటూ వచ్చిన తనకు, శివారెడ్డిని చూసిన తరు

వాత- అదంతా ఆ మగవాళ్లలోని బలహీనతేగానీ తన అందం కాదని తెలిసొచ్చింది. ఏమంత అందగాడు కాని శివారెడ్డి తన అహం మీద దెబ్బకొట్టినాడనిపించింది.

తన సహజ ధోరణిలో ఎంతోమందికి పంపినట్లు, ఉదయమే శివారెడ్డికి కూడా, 'గుడ్‌మార్నింగ్ సర్!' అంటూ ఎస్ఎంఎస్ పంపేది. ఏరోజూ బదులొచ్చేది కాదు.

ఒకసారి ఏదో కల్చరల్ ప్రోగ్రామ్‌లో, తాను ఒకప్పుడు మంచి డ్యాన్సర్‌ననీ, తాను మద్రాసులో వెంపటి చినసత్యం మాష్టారు దగ్గర నాట్యం నేర్చుకున్నాననీ చెప్పేసరికి- తనతో ఆ మాట ఈ మాట కలిపాడు.

శివారెడ్డికి సాహిత్యమన్నా, సంగీతమన్నా, కళలన్నా మంచి అభిరుచి ఉందని గ్రహించింది. సాహితీ సంగీత కళాకారులను ఆదరంగా చూస్తాడని తను గ్రహించింది.

తర్వాత ఎన్నోసార్లు కాఫీకి ఇంటికి ఆహ్వానిస్తే, తానే తన ఇంటికి ఆహ్వానించాడు. భార్యను పరిచయం చేశాడు.

భార్యతో మాత్రమే ఉంటూ, భార్యను ప్రేమగా చూసుకునేవాళ్లంటే తనకు పట్టలేనంత ఈర్ష్య. శివారెడ్డి మీద ఆ ఈర్ష్యే తనలో పట్టుదల పెంచింది. జీవితంలో అనుభవించని 'భార్య అనుభూతి' తనలో మేల్కొని పట్టి పీడించింది.

ఆ తరువాత తన ఇంటికి కాఫీకి వచ్చిన శివారెడ్డితో తన కథంతా చెప్పింది. అతని కళ్లలో చెమ్మ చూసింది. మెల్లగా అతని కాళ్ల దగ్గర కూర్చుని, కుర్చీలో కూర్చున్న అతని ఒడిలో తలపెట్టుకుంది. తనకెంతో సేద తీరినట్లనిపించింది. శివారెడ్డి అభ్యంతర పెట్టకపోవడం గమనించింది.

శివారెడ్డి విషయంలోనూ కూతురికి ఎప్పటిలాగే 'డబ్బు అవసరాన్నే' విడమరచి చెప్పింది.

ఎదిగొచ్చిన కూతురుకు ఈసారి తన మాటలు రుచించలేదు. తను కూతురుకు ఎదురుచెప్పలేదు కాని ఆమె చదువు కోసం నెల్లూరులో ఉన్నప్పుడు శివారెడ్డిని ఇంటికి ఆహ్వానిస్తూనే వచ్చింది. ఏడాదిపాటు శివారెడ్డి సాంగత్యంలో తను కోల్పోయిన అన్ని అనుభూతుల్ని చవిచూసింది.

'నాన్నా!' అని పిలవడానికి నోచుకోని తన కూతురిని, ఆయన తన మంచితనంతో ఆకట్టుకుని తండ్రైనాడు. నెల్లూరు నుండి సెలవుల్లో వచ్చినప్పుడు ఆయనను వెంటబెట్టుకొని వెళ్లి తనకు కావల్సినవన్నీ కొనిపించుకొనేది. స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్ లాంటివన్నీ. రెండేళ్లు తనకూ, తన కూతురికీ ఏ లోటు లేకుండా చూసుకున్నాడు. తన భార్యకు కూడా నచ్చచెప్పుకుంటాననీ చెప్పేవాడు.

తను అమ్మవారి గుడిలో 'మాంగల్యపూజ'లో పాల్గొని, అక్కడ పూజారులిచ్చిన పసుపుదారాన్ని తెచ్చి తన మెడలో వేయమని అడిగినప్పుడు, ఆలోచించకుండా వేశాడు...

ఇంతలోనే ఊహించని పరిణామాలు ఎదురయ్యాయి. కొన్ని ప్రభుత్వ భూములకు ఎన్ఓసీ (నిరభ్యంతర పత్రాలు) ఇచ్చిన కేసులో పై అధికారి, తన తప్పిదాలను శివారెడ్డిపై తోసి, అతని సస్పెన్షన్‌కు కారణమయ్యాడు. ఉద్యోగంలో పై సంపాదనకు అలవాటు పడని శివారెడ్డి, వచ్చే సగం జీతంతో ఆర్థికంగా చితికిపోయాడు. తమకోసం సమయం కేటాయించలేకపోయినాడు.

అదే సమయంలోనే, తన కూతురు బి.టెక్ పూర్తి చేసుకొని నెల్లూరు నుండి వచ్చి ఇంట్లోనే ఉండటంతో- ఆయనకూ తనకూ మధ్య పొరలు పొడచూపినాయి.

గత రెండేళ్లు ఇచ్చినట్లుగా ఇప్పుడు అవసరాలకు డబ్బు ఇవ్వడం లేదని కూతురు గ్రహించింది.

'ఇంటి అవసరాలకు డబ్బు అడగ'మని తనను పోరుపెడుతూ వచ్చింది.

''నువ్వు అందరితో సంబంధం పెట్టుకున్నది డబ్బు కోసమే కదా! నా భవిష్యత్తు అవసరాల కోసమే కదా! ఇప్పుడు డబ్బు ఇవ్వలేని ఆ మనిషిని ఇంటికి రానివ్వద్ద,''ని అంది.

''ఆయనను విడిచి నేనుండలేనమ్మా! ఆయనకు కూడా మనమంటే ప్రేమ,'' కూతురికి చెప్పుకుంది.

''నీకేమన్నా పిచ్చా? ఆ యప్ప తన పెళ్లాం, పిల్లల్ని వదిలేసి మనల్ని శాశ్వతంగా చూసుకుంటాడా? వారం రోజులు నువ్వు మంచానపడి, ఆ వారంరోజులు రేయింబవళ్లూ ఆ యప్పను ఇక్కడే ఉండమను. తెలుస్తుంది,'' అంది.

అప్పుడు తన కూతురు వాదన తనకు సబబే అనిపించింది. తన కూతురు పెట్టమన్న పరీక్షలన్నీ పెట్టింది... వేధించింది.

కూతురు ఎలా చెప్పమంటే, అతనితో అలా చెబుతూ అసంబద్ధమైన కోర్కెలు, నిబంధనలు విధించింది. తను ఏం చేస్తున్నానో, ఏం మాట్లాడుతున్నానో తెలియ కుండా అతనికి ఫోన్‌చేసి వికారపు మాటలు మాట్లాడింది.

'నీ కుటుంబం పోషించుకుంటున్నావ్. మమ్మల్ని పోషించకుండా తప్పించుకున్నావ్. నన్ను ఉద్దరగా అనుభవించిపోతున్నావ్. నువ్వు రావద్దు,'ని శాసించింది.

ఆ సందర్భంలో ఆయనన్న మాటలు తనను పాతాళంలోకి కుంగదీశాయి. "నేను హృదయంతో ప్రేమించాను. లాభనష్టాల బేరీజు వేసుకొని ప్రేమించ లేదు. నువ్వు మెదడుతో ప్రేమించావు. లాభనష్టాల లెక్కలు ముందే లెక్కకట్టుకొని నన్ను ప్రేమించావు"... ఆ మాటలతో తను నిలువునా నీరైపోయింది.

శివారెడ్డి సమాగమంతో తన హృదయం మళ్లీ జీవం పోసుకుందని అనుకుంది. అటువంటి తను, అతనితోనే - హృదయం లేనిదనిపించుకుంది. డబ్బు కోసమే తను శరీరాన్ని ఎర వేశాననిపించుకుంది.

మళ్లీ కోపం కూతురి మీదకు మళ్లింది.

తన కూతురు కన్నా ప్రపంచంలో ఎవరూ ఎక్కువ కాదని ఇన్నేళ్లూ భావించిన తను, ఎందుకో శివారెడ్డి విషయంలో కూతురుతో వాదనలకు దిగింది. జీవితంలో తల్లి నుండి ఎప్పుడూ ఎదురుకాని ఈ హఠాత్పరిణామాలను, ఆ పాప కూడా జీర్ణించుకోలేకపోతున్నట్లుంది.

వాళ్ల బాబాయి, పిన్నిలు తనకు అక్కడే పెళ్లి సంబంధాలు చూస్తున్నారనీ, 'నువ్వు నా పెళ్లి చేయలే'వంటూ నెలరోజుల క్రితం కూతురు కోయంబత్తూరుకు వెళ్లిపోయింది.

కోయంబత్తూరు నుండి ఫోన్ చేసినప్పుడల్లా, శివారెడ్డి పట్ల తన వ్యతిరేకతను వెళ్లగక్కుతూ హెచ్చరికలు చేస్తూనే ఉంది. వాడు డబ్బూ ఇవ్వడు. నిన్నూ చూసుకోడు. అతను ఇంటికి వస్తూ పోతుంటే నా భవిష్యత్తేమిటి? నా పెళ్లెలా జరుగుతుంది? అని ఫోన్లో ప్రశ్నల వర్షం కురిపిస్తోంది... తనకు జవాబులు దొరకడంలేదు.

ఆయన మాత్రం రావడం మానుకున్నాడు. పాప ఇంట్లో లేదు రమ్మన్నా రావడం లేదు. తనకు పిచ్చిపట్టి ఇష్టమొచ్చినట్లు తిట్టింది. కూతురు మాటలు తనపై పనిచేసి 'అందరిలాంటివాడివే నువ్వూ. థూ!' అంది. అంతటితో ఊరుకోకుండా ఆయన భార్యకు ఫోన్‌చేసి చెడామడా తిట్టింది. అంతే, తమ మధ్య అగాథం ఏర్పడింది.

తన జీవిత లక్ష్యంగా, ప్రాణంగా భావించిన కూతురును వ్యతిరేకించలేక తనేం చేస్తున్నానో తెలియనంత పిచ్చెక్కి అతన్ని, అతని కుటుంబాన్ని మూడు నెలలపాటు మానసిక క్షోభకు గురిచేసింది తను. డాక్టర్ చెప్పినట్లు నిద్రమాత్రల ప్రభావంతో తను మానసికంగా స్థిమితం కోల్పోయానని ఒంటరిగా కూర్చుని ఏడ్చింది.

ఇప్పుడు మూడునెలలుగా అతని నుండి ఫోన్ లేదు. ఎస్ఎంఎస్ లేదు. తను చేస్తున్నా బదులు లేదు. ఎస్ఎంఎస్‌లతో తిడుతున్నా, బ్రతిమాలుతున్నా బదులు లేదు.

*

చుట్టూ చీకటి వ్యాపించిన విషయం కూడా గుర్తించనంత గాఢంగా కల్పన ఆలోచనల్లో మునిగుంది. ఉన్నట్లుండి చుట్టూ చీకటిని గుర్తించి, బెంచీ మీద నుండి లేచి నీరసంగా అడుగులేస్తూ ఇంటిదారి పట్టింది.

చివరిసారిగా శివారెడ్డికి ఫోన్ చేయాలనిపించింది. ఇటీవల తన నంబర్ చూడగానే కట్ చేస్తున్నాడు- ఎలా మరి?

దారిలో ఎవరో కనపడితే, 'ఒక ఫోన్ చేసుకుంటాను. సెల్ ఇస్తారా!?' అనడిగింది.

ఆవతలి నుండి 'హలో!' అని వినిపించగానే, "నేను కల్పనను ఫోన్ పెట్టేయకండి ప్లీజ్!" అంది వేడుకోలుగా.

'ఊ...' అని వినిపించింది.

"మనం కలిసుంటే, తన పెళ్లెలా జరుగుతుందని పాప అడుగుతోంది. మీరేమన్నా చెప్తారా," అనడిగింది పొడిపొడిగా...

'ఇంతకు ముందోసారి చెప్పినా. ఇప్పుడూ అదే చెప్తున్నా. ఆ పాపకు తండ్రిగా నిలబడి కన్యాదానం చేయగలను. అంతకన్నా ఏం చేయలేను. ఇంక ఇలా కొత్త నంబర్లతో ఫోన్ చేయొద్దు," అంటూ ఆవతల ఫోన్ పెట్టేసిన చప్పుడు వినిపించింది.

కల్పన నిట్టూర్చింది. ఫోన్ ఆ వ్యక్తికి ఇచ్చి, వచ్చి ఇంట్లోకి అడుగుపెట్టింది... ఎక్కడో చిన్న ఆశ తొంగి చూస్తోంది. తన సెల్ ఆన్ చేసి కూతురుకి ఫోన్ చేసింది.

ఆవతల నుండి, "ఏమ్మా?" అని వినిపించింది విసుగ్గా.

"ఏం లేదమ్మా!..." చెప్పడానికి సంశయించింది కల్పన. అయినా తప్పదు.

ఆయన చెప్పిన విషయాన్ని మరింత విడమరిచి స్పష్టంగా కూతురుకి చెప్పింది. వెంటనే అవతల ఫోన్ పెట్టేసిన శబ్దం.

కల్పనకు మళ్లీ చేయాలనిపించలేదు. శివారెడ్డి మాట వినడానికే తన కూతురు ఇష్టపడుతున్నట్లు లేదు.

ఐదు నిముషాల తర్వాత కూతురు నుండి ఫోన్... ఎత్తింది. "ఆ యప్ప ఏమీ కన్యాదానం చేయాల్సిన పని లేదు. అతనేమైనా నన్ను కన్నతండ్రా? మీ అమ్మకు

అతను ఎన్నోవాడు?- అని అడిగితే, పెళ్లికొడుకు తరపు వాళ్లకు ఏం చెప్పాలని పిన్ని, బాబాయ్ అంటున్నారు...'' అంటూ ఫోన్ పెట్టేసింది.

కల్పనకు ఆకాశం మీద నుండి దభేళున నేల మీదకు పడ్డట్లనిపించింది. 'అతను ఎన్నోవాడు?' కాకులలోకం పాడిచే మాటలు కూతురి నోటి వెంట రావడం తల్లిగా కల్పన జీర్ణించుకోలేకపోయింది.

కూతురును తీర్చిదిద్ది, ఆమెకు ఆస్తిపాస్తులు సంపాదించడమే తను నైతికమనుకుని జీవిస్తే, ఇప్పుడు అదే కూతురు తన జీవితాన్నే అనైతికమని తేల్చేసింది. కల్పనకు జీవితమే ఒక పెద్ద అగాథంలా కనిపించింది.

కొద్దిసేపటికి మళ్లీ ఫోన్ మోగింది. కూతురే... ఎత్తొద్దనుకుంటూనే, ఫోన్ ఎత్తింది. ''అయినా, నాకు చిన్నప్పుడే తండ్రి పోయాడనీ, నేను పిన్నీ బాబాయ్‌ల దగ్గర పెరిగాననీ పెళ్లివాళ్లకు చెప్పేశాం. రెండు రోజుల్లో వాళ్లు నీతో మాట్లాడటానికి వస్తామన్నారు. నువ్వు ఆ తాళిబొట్టు, మెట్టెలు, పూలు తీసేసి భర్త పోయినదానిలా కొంచెం సాంప్రదాయంగా ఉండు. నా జీవితానికి నువ్వే గుదిబండగా మారొద్దు. వాళ్లు అక్కడికొచ్చి చూసిపోగానే, నువ్వు కూడా అక్కడ ఖాళీ చేసి కోయంబత్తూరుకొచ్చి అమ్మమ్మ, మామయ్య వాళ్ల దగ్గర ఉండు... ఇదిగో, బాబాయ్ అన్నీ చెప్తాడు విను,'' అంటూ, తన సమాధానం కోసం చూడకుండా ఫోన్ అవతలకు ఇచ్చింది.

కల్పనకు ఏమీ వినాలనిపించలేదు. ఫోన్ కట్ చేసింది... నేల కూడా కుంగి ఎక్కడో పాతాళానికి జారిపోతున్నట్లనిపించింది. పడిపోతూ మంచం పట్టుకుంది. టేబుల్ మీద ఉన్న నిద్రమాత్రలను తీసుకుని, అలాగే నేలమీదికి ఒరిగిపోయింది.

శిలలామారిన తనకు రెండేళ్ల క్రితం అతని పరిచయంతో మనసు మేల్కొంది. ఆ మనసు అనుభూతులకు జీవం పోసింది. తనకూ ఓ జీవితం ఉందని గుర్తు చేసింది. కానీ... తన జీవితాన్ని తానుగా జీవించే స్వేచ్ఛను చేజేతులా పోగొట్టుకున్నానని కల్పనకు మెల్ల మెల్లగా అర్థం కాసాగింది. కూతురి మీద ఏ కోపమూ రాలేదు. ఆ మాటకొస్తే యిప్పుడెవరి మీదా రావటం లేదు.

వెల్లకిలాపడి పైకప్పుకేసి చూస్తుండిపోయింది. కళ్లు గాజుకళ్లలా నిర్జీవంగా ఉన్నాయి.

*రచన మాసపత్రిక, మే 2014*

